

విలేకరిపై మట్టి మఫియా దౌర్జన్యం

రాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి బెదిరింపులు

ప్రజాశక్తి-అనంతపురం

బుక్కరాయసముద్రం మండంలోని పసలూరులో మట్టిమాఫియా విలేకరిపై దౌర్జన్యానికి దిగింది. తమ గురించి సమాచారం ఇచ్చి పత్రికల్లో కథనాలు రాయిస్తావా..నీ అంతు చూస్తామంటూ రాత్రి సమయంలో ఇంట్లోకి జొరబడి మరీ బెదిరింపులకు దిగారు. దీనికి సంబంధించి పూర్వాపరాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్న పెద్దన్న స్వగ్రామం పసలూరు. ఈ గ్రామానికి చెందిన మట్టి మాఫీయాలో అధికార పార్టీనేతలున్నారు. బుక్కరాసముద్రం పరిధిలోని వైఎస్ఆర్ కాలనీ మొత్తం తవ్వేసి మట్టిని అమ్మేస్తున్నారు. ఈ విషయమైన కొన్ని పత్రికల్లో కథనాలొచ్చాయి. అదే సమయంలో పసలూరు గ్రామానికి చెందిన టి.పవన్, టి.హరిలకు సంబంధించిన టిప్పర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకుని స్టేషన్‌లో ఉంచారు. దీనికి కారణం ప్రజాశక్తి విలేకరి పెద్దన్న అని అనుమానిస్తూ నలుగురు వ్యక్తులు శనివారం అర్ధ రాత్రి సమయంలో పెద్దన్న ఇంట్లోకి జొరబడి దాడికి యత్నించడంతోపాటు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అతనినికులం పేరుతో దూషించారు. 'నీ అంతు చూస్తామ'ంటూ బెదిరింపులకు దిగారు. దాడి చేసే పరిస్థితులు కనిపించడంతో పెద్దన్న వెంటనే 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లడంతో ఆ వ్యక్తులు వెనుదిరిగారు. దీనిపై ఆదివారం ఉదయం బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విలేకరిపై దాడిని ఎపిడబ్లుజెఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎపిడబ్లుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.షఫివుల్లా ఒక ప్రకటన విడుదల చేశారు. మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న వారిపై పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. అదే విధంగా పెద్దన్నను కులం పేరుతో దూషించిన పవన్, హరిపై అట్రాసిటి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులు ఆపాలి : బుక్కరాయసముద్రం మండలం పసులూరు గ్రామంలోని జగనన్న కాలనీలో అక్రమ మట్టిని తరలిస్తున్న అధికార పార్టీ నాయకులు విలేకరులపై బెదిరింపులు ఆపాలని సిపిఎం మండల నాయకులు హెచ్చరించారు. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, మండల నాయకులు సి నాగేంద్ర, నెట్టికంటయ్య, పుల్లయ్య సంజీవరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మధ్యలో మట్టిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన అధికార పార్టీ నాయకులు విలేఖరులకు బెదిరించడాన్ని సిపిఎం మండల కమిటీ ఖండిస్తోందని అన్నారు. ఇలా దాడులకు పాల్పడటం మంచిది కాదని హితవు పలికారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే మట్టిమాఫియా మండలంలో కొనసాగుతోందని విమర్శించారు. విలేకరులపై బెదిరింపులు ఆపకపోతే వివిధ ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. విలేకరిపై దాడికి యత్నించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ఉచిత కుట్టు శిక్షణ' కథ కంచికేనా..?

ఉపాధి పేరుతో పేద మహిళలను ఊరించారు. ఉచిత శిక్షణ.. కుట్టు మిషన్లు.. అంటూ ప్రగల్భాలు పలికారు. ఆశపడి వేలాదిమంది మహిళలు శిక్షణ తీసుకున్నారు. శిక్షణ ముగిసింది. 'మిషన్' ఇంకా బాకీ ఉంది.మూడు నెలలు గడుస్తున్నా కుట్టు మిషన్లు..సర్టిఫికెట్ల మాటే లేకుండా పోయింది. కుట్టు శిక్షణ పేరిట కట్టు కథ అల్లారని మహిళలు విమర్శిస్తున్నారు. మరోపక్క మహిళలకు మూడునెలలు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చిన గుత్తేదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. శిక్షణ ఇచ్చిన సిబ్బంది వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ

- ఉమ్మడి జిల్లాలో 9వేల మందికి ఉచిత శిక్షణ
- కుట్టుమిషన్ల కోసం మహిళల ఎదురుచూపులు
- మూడు నెలలైనా అందని కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు
- సిబ్బందికి అందని వేతనాలు, బిల్లుల కోసం గుత్తేదారుల ఎదురుచూపు
- బీసీ, ఈబీసీ, కాపు మహిళలకు రిక్తహస్తం

బీసీ కార్పొరేషన్ల ద్వారా బీసీ, ఈబీసీ, కాపు వర్గానికి చెందిన పేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పేరిట కూటమి ప్రభుత్వం హడావుడి చేసింది. శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆచరణలోకి వచ్చే సరికి రిక్తహస్తం చూపిస్తోంది. కుట్టు మిషన్లు వస్తాయి.ఉపాధి పొందవచ్చని ఆశించిన మహిళలకు నిరాశే ఎదురైంది. రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ ద్వారా 65వేల మందికి కూటమి ప్రభుత్వం కుట్టుశిక్షణ ఇప్పించింది. శిక్షణ పూర్తయి 4నెలలు గడుస్తున్నా వారికి ఇస్తామన్న కుట్టుమిషన్లు పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి తొలుత లక్ష మంది బీసీ, ఈబీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. 3,43,413 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 680 కేంద్రాలను ఏర్పాటుచేసి 1326బ్యాచ్‌ల ద్వారా 65,987 మందికి మొదట శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 85 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 9,000 మందికి పైగా శిక్షణ ఇచ్చారు.

90 రోజులపాటు శిక్షణ..

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్ 23న శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. టైలరింగ్ శిక్షణకు సంబంధించి అర్హులైన వారు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తులు జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లతోపాటు ఎంపీడీవోలకు పంపారు. నిబంధనల ప్రకారం నిరుపేదలై ఉండి 18 ఏళ్లు పూర్తయి 60 ఏళ్లలోపు గల వారిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. పెనుకొండ కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ శిక్షణ కార్యక్రమ బాధ్యతలను తీసుకున్నారు. ఆ మేరకు జిల్లావ్యాప్తంగా 85 శిక్షణ కేంద్రాలనుఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో ఆయా మండల, మున్సిపాలిటీల్లో అవసరమైన వసతులతో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుట్టు మిషన్లు, ఇతర సామగ్రి సమకూర్చడంతోపాటు అనుభవజ్ఞులైన ట్రైనర్లను నియమించారు. ఈ కేంద్రాల ద్వారా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 5 గంటల వరకు మరో బ్యాచ్‌గా మొత్తం 9వేల మందికి 90 రోజులు శిక్షణ ఇచ్చారు.

నాలుగు నెలలైనా అందని కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు

90 రోజులపాటు శిక్షణానంతరం శిక్షణ పొందిన మహిళలకు రూ.6 వేలు విలువైన బేసి కొమోడల్ కుట్టుమిషన్ ఉచితంగా అందజేయాలి. సర్టిఫికెట్ ఇవ్వాలి. శిక్షణ పూర్తయి దాదాపు నాలుగునెలలు గడుస్తున్నా ఇంతవరకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందలేదు. శిక్షణ పూర్తి కాగానే ఉచితంగా కుట్టుమిషన్ వస్తుందని, ఈ మిషన్ ద్వారా స్థానికంగాటైలరింగ్ షాపును నిర్వహిస్తూ ఉపాధి పొందవచ్చని పేద మహిళలు భావించారు. అయితే వారి ఆశ నిరాశే అయింది. శిక్షణ పొందిన వారికి నిర్వాహకులు ఏ సమాధానం చెప్పక పోవడంతో శిక్షణ పొందిన మహిళల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.

సిబ్బందికి అందని వేతనాలు, బిల్లుల కోసం గుత్తేదారులు ఎదురుచూపు

ఉచిత శిక్షణలో భాగంగా ఒక కేంద్రానికి ఒక టీచర్ తోపాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించారు. టీచర్ కుట్టు శిక్షణలో మెళుకువలు నేర్పడానికి, కంప్యూటర్ ఆపరేటర్ అభ్యర్థుల హాజరు తదితర వివరాలు నమోదు చేసుకునేందుకు నియమించారు. టీచర్‌కు ఒక నెలకు రూ. 15 వేలు, కంప్యూటర్ ఆపరేటర్ కు రూ.12 వేలు చొప్పున వేతనం ఇవ్వాలి. 90 రోజుల శిక్షణ పూర్తి అయినప్పటికీ వేతనాలు అందలేదు. శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి అందుకు అవసరమైన కుట్టు మిషన్లు ఇతర సామాగ్రిని ఏర్పాటు చేసిన గుత్తేదారులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చామని ఇంతవరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గుత్తేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శిక్షణ పొందిన ప్రతి మహిళకు కుట్టుమిషన్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో శిక్షణ పొంది కుట్టుమిషన్ల ద్వారా జీవనభృతి పొందాలనుకున్న మహిళలు శిక్షణకు హాజరయ్యారు. ఇప్ప టికే శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమకు ఇస్తామన్న ఉచిత కుట్టుమిషన్ అందజేస్తే ఉపాధి పొందడానికి అవకాశం ఉందంటున్నారు.



కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళలు (ఫైల్ ఫొటో)

కుట్టు మిషన్లు తక్షణం ఇవ్వాలి



శిక్షణ పూర్తి చేసుకుని ఉచిత మిషన్ కోసం ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం తన కుటుంబం జీవనోపాధికి తోడ్పాటు అందించాలి. శిక్షణ పూర్తి అయి నాలుగు నెలలు అవుతున్న ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ప్రభుత్వం తక్షణం కుట్టు మిషన్ ఇవ్వాలి.

మహేశ్వరి ,
కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళ,
(పెనుకొండ)

28న శాసనసభ కమిటీ జిల్లా పర్యటన

షెడ్యూల్డ్ కులాల సంక్షేమంపై సమావేశం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ ఈ నెల 28వ తేదిన అనంతపురం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న ఉదయం 9.30 నుంచి 11.00 గంటలకు అనంతపురం నగరంలోని ఆర్.అండ్.బి గెస్ట్ హౌస్‌లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ భవన్‌లో 11.00 గంటల తర్వాత జిల్లా అధికారులతో సమావేశం అవుతారని, సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసులు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ సేవలలో రిజర్వేషన్ల అమలు, షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ఇతర అంశాలను సమీక్ష నిర్వహిస్తారన్నారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ సభ్యుల వివరాలు..

శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల, శాసనసభ సభ్యులు కొండ్రు మురళీమోహన్, కొలికపూడి శ్రీనివాస రావు, తాటిపర్తి చంద్రశేఖర్, దేవి వరప్రసాద్, బోనెల విజయచంద్ర, ఎమ్మెస్ రాజు, రోషన్ కుమార్ సొంగ, విజయ్ కుమార్ బి.ఎన్, శాసనమండలి సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, బొమ్మి ఇస్రాయెల్, మురళీధర్ మెరిగ ఉన్నారు. కావున జిల్లాలోని సెడ్యూల్డ్ కులాల ప్రజలు, ఆ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు ఈ కమిటి సభ్యులకు వినతిపత్రాలు అందజేసి సమస్యల పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్ నియామకంపై అవకతవకలు

సర్టిఫికెట్లు పీజీ అభ్యర్థివి, పాఠాలు చెప్పింది డిగ్రీ యువతి వచ్చిన వేతనంలో ప్రిన్సిపల్ చేతివాటం

ప్రజాశక్తి -కణేకల్లు

కనేకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024 విద్యా సంవత్సరంలో జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టు నియామకంలో పెద్ద ఎత్తున అవకతవకలు వెలుగు చూశాయి. పీజీ యువతి సర్టిఫికెట్లు సమర్పించి బదులుగా డిగ్రీ చదివిన యువతీతో విద్యార్థులకు పాఠాలు చెప్పించినట్లు సమాచారం. గెస్ట్ పోస్టుకు పదివేల రూపాయల వేతనాలన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. సర్టిఫికెట్ సమర్పించిన అమ్మాయి ఖాతాలో నెలనెలా 10 వేల రూపాయలు పడినప్పటికీ తక్షణమే ఆ యువతి ద్వారా వేతనం మొత్తం ప్రిన్సిపల్ చేతికి వెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విద్యార్థులకు పాఠాలు చెప్పిన డిగ్రీ అమ్మాయికి కొంత మొత్తం ఇచ్చి మిగిలిన మొత్తం ప్రిన్సిపల్ తన జేబులో వేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2024 సంవత్సరంలో సర్టిఫికెట్ సమర్పించిన యువతికి 2025 సంవత్సర కాలంలో యధావిధిగా కొనసాగిస్తామని చెప్పి ప్రిన్సిపల్ ఆమె వద్ద సర్టిఫికెట్లు తీసుకున్నట్లు సమాచారం. 2025 విద్య సంవత్సర కాలంలో జూన్ మాసంలో సర్టిఫికెట్లు సమర్పించిన అమ్మాయి ఇంటర్ విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి తనను కొనసాగించాలని స్థానిక ప్రిన్సిపల్‌ను అడిగితే ఆయన సరే అని చెప్పి కొత్తపల్లవి అందుకున్నట్లు తెలిసింది. 2025 గెస్ట్ జువాలజీ లెక్చరర్‌కు రూ. 25 వేలకు వేతనం పెరగడంతో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కొత్త ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి చెందిన యువతకి జువాలజీ గెస్ట్ పోస్ట్ ఇవ్వడానికి ప్రిన్సిపల్ వ్యూహం రచించి పత్రికా ప్రకటన ద్వారా ఎంపిక జరిగిందని చెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. గత సంవత్సరం తన సర్టిఫికెట్లు సమర్పించిన యువతి ప్రిన్సిపల్ వద్దకు వెళ్లి తనకు రావాల్సిన జువాలజీ గెస్ట్ పోస్టు మరొకరి ఇవ్వడం ఎంత వేరకు న్యాయం అని అడిగితే ప్రిన్సిపల్ ఆయువతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 'ఇది నా కాలేజీ.. నా ఇష్టం అడగడానికి నువ్వు ఎవర'ని బదులు సమాధానం ఇవ్వడంతో ఆ యువతి కన్నీరు పెట్టుకుని వెళ్ళిపోయిందని సమాచారం. ఈ ఘటనతో ప్రిన్సిపల్ గత ఏడాది ప్రదర్శించిన చేతివాటం బయట పడింది. ప్రిన్సిపల్ వైఖరిపై ఉన్నత విద్యా జిల్లా అధికారులు విచారణ జరిపించి తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో జూనియర్ కళాశాల ముందే ధర్నా కార్యక్రమాలు చేపడతామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

పాపంపేట పాపం ప్రకాష్ రెడ్డిదే : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూరు

పాపంపేట వివాదం పాపం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిదే అని టిడిపి స్థానిక నాయకులు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బండి పరశురామ్, జిల్లా అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, మాజీ జెడ్పీటీసీ కుళ్లాయప్ప, అంకె ఆనంద్, అక్కులన్న, గాలి నరసింహ తదితరులు మాట్లాడారు. ప్రకాష్‌రెడ్డి రాజకీయ నిరుద్యోగి అని అన్నారు. రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి పాపంపేట వాసులను భయందోళనకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. టిడిపి హాయంలోనే రాప్తాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందుతోందని అన్నారు. పాపంపేట వాసులకు పరిటాల కుటుంబం అండగా ఉంటుందన్నారు. పాపంపేట భూములపై ప్రకాష్‌రెడ్డి చీకటి ఒప్పందాలు దగ్గర్లో బయట పడతాయని అన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

వ్యవసాయ కార్పొరేటీకరణను వ్యతిరేకిద్దాం

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల వ్యవసాయంగా మార్చే ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని క్రిష్టపాడు గ్రామంలో ఎపి రైతు సంఘం నాయకులు డి.దస్తగిరి అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. ప్రభుత్వాల విధానాలు ఫలితంగానే రైతుల వ్యవసాయం నష్టాల్లో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల వ్యవసాయంగా మార్చడం దుర్మార్గమన్నారు. రైతాంగం కోరుతున్న విధంగా మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అప్పుల్లో ఉన్న రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. బలవంతపు భూ సేకరణ ఆపాలని, ప్రస్తుతం ఉన్న లీజు విధానాన్ని రైతులకు అనుకూలంగా మార్పు చేయాలన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తూ జీవో ఇచ్చిందన్నారు. దీనివల్ల దేశంలో పండించే పత్తి పంటకు డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయి ప్రమాదం ఉందన్నారు. పత్తి, మొక్కజొన్న పంటలకు షరతులు లేకుండా గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని, పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రెండో విడత రైతులకు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కృష్ణనారాయణ, అధ్యక్షులు ఆదినారాయణ, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మద్దిలేటి, సత్యనారాయణ, మహమ్మద్‌రఫీ, హరిగోపాల్, శివ కృష్ణ, గొడ్డలి రాయుడు, సుధీర్‌రెడ్డి, సాయికుమార్, లక్ష్మణ్‌కుమార్, వీరాంజినేయులు, సుంకయ్య, జశ్వంత్, బాలకృష్ణ, నరసింహులు, ఉపేంద్ర, మురళి, పెద్దయ్య, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

జిల్లా రవాణాశాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి



ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు ఉండవని జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. వాహనాలు నడిపే డ్రైవర్లు అతివేగంగా వెళ్లడం, మద్యం సేవించి వాహనాలు నడపడం నిర్దేశించిన కెపాసిటీని కాదని అధిక లోడ్ వేసుకొని ప్రయాణించడం, రోడ్డు మలుపులలో సైతం వేగంగా ప్రయాణించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. కొందరు మైనార్టీ తీరని పిల్లలు కూడా వేగంగా బైకులు, ఇతర వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. ఈ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎన్నో నియమ నిబంధనలు విధించినప్పటికీ ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉంటాయి. తరచూ రవాణా శాఖ అధికారులు, పోలీస్ శాఖ వారు తనిఖీలు నిర్వహిస్తూ ఆర్ సి (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్) డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు ఉన్నాయా లేదా అని చూస్తూనే ఉంటారు. ప్రమాద సూచికల బోర్డులు ఉన్నా వాటిని పట్టించుకోకుండా వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలకు లోనవుతుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డు భద్రత నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.

ప్రశ్న: ప్రధానంగా వాహన డ్రైవర్లకు ఉండవలసిన ధ్రువీకరణ పత్రాలు ఏమిటి? ఎక్కడ మంజూరు చేస్తారు?

ఆర్టీవో : డ్రైవర్లకు ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కాలుష్య నియంత్రణ (పొల్యూషన్) సర్టిఫికెట్, వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలి. ఇవేవీ లేకుండా వాహనాలు నడపకూడదు. అలా నడిపితే చట్టపరంగా జరిమానాలతో పాటు వాహనాలు సీజ్ చేస్తాం. మా శాఖ అధికారులతో పాటు పోలీస్ అధికారులు కూడా తనిఖీలు నిర్వహించే అధికారం ఉంది. జిల్లాలో హిందూపురం, ధర్మవరం, కదిరి ప్రాంతాల్లో వాహనాల ఆర్‌సి డ్రైవింగ్ లైసెన్స్ మా శాఖ కార్యాలయాల్లో పొందవచ్చు. కొత్త వాహనాలు అయితే కొనుగోలు కేంద్రాలైన షోరూమ్ లోనే డీలర్లే లైసెన్స్, బండి నెంబర్, ఆన్ లైన్ ద్వారా కొనుగోలుదారులకు అందించే విధంగా కూడా మార్పులు వచ్చాయి. కొత్త వాహనదారులు ఈ సౌకర్యం పొందవచ్చు.

ప్ర: వాహనాల ఫిట్నెస్ ఎక్కడ చూస్తారు?

ఆర్టీవో : గతంలో మా శాఖ చూస్తూ ఉండేది. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా అంతటికి మండల కేంద్రమైన బుక్కపట్నంలో ప్రభుత్వం నియమించిన ప్రైవేటు వ్యక్తుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. వాహన దారులు తమ వాహనాల ఫిట్నెస్ అక్కడే చేయించుకోవలసి ఉంటుంది. వాహనాల ఫిట్నెస్ యంత్ర పరికరం ద్వారా నిర్ధారిస్తారు.

ప్ర: జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి? వాహనాలకు ఎంత జరిమానా విధించారు?

ఆర్టీవో : జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 429 ప్రమాదాలు జరగగా 255 మంది మృతి చెందారు. 483 మంది గాయపడ్డారు. అలాగే వాహనాలకు జరిమానాల రూపంలో రూ .1.98 కోట్లు వసూలు చేయడం జరిగింది. ఈ జరిమానాల వల్ల ప్రజల్లో మార్పు వస్తుందనుకోవడం లేదు. వారిలో చైతన్యం రావాలి. ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎంతో నష్టపోవాల్సి ఉంటుంది. ఆయా కుటుంబాలలో ఎంతో విషాదం చోటు చేసుకుంటుందన్న విషయాలపై అవగాహన వస్తే ప్రమాదాలు నివారణ సాధ్యమవుతుంది.

ప్ర :ప్రజల్లో చైతన్యం కోసం మీ శాఖ చేపట్టే కార్యక్రమాలు ఏమిటి?

ఆర్టీవో : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఏటా జనవరి మాసమంతా రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ పై అవగాహన కార్యక్రమాలు చేపడతాం. పాఠశాలల్లో, కళాశాలలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. హెల్మెట్ వల్ల కలిగే ప్రయోజనాలు, రోడ్డు నియమ నిబంధనలు వివరిస్తాం. అలాగే కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా అవగాహన కల్పిస్తాం.

ప్ర: సత్యసాయి జన్మదిన వేడుకలలో మీ శాఖ పాత్ర ఏమిటి?

ఆర్టీవో : ఆటోలు, ఇతర వాహనాలలో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ప్రయాణికులను ఎక్కించుకున్నా, ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోయినా తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తాం. సత్య సాయి జయంతి వేడుకలకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వీవీఐపీలకు ప్రోటోకాల్స్ వాహనాలు సమకూరుస్తాం.



జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి

ప్ర: సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

ఆర్టీవో : సిబ్బంది కొరత అంటూ లేదు. ప్రమాదాలు జరగకుండా ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి. ఎవరు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ప్రమాద సూచికలు గమనించి వాహనాలు నడపాలని సూచిస్తున్నాం. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి. మైనర్ తీరని పిల్లలు వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాల బారిన పడకుండా అందరూ క్షేమంగా ఉండాలని కోరుతున్నాం.

ప్రజాశక్తి www.prajasakti.com



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు

సిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ బళ్లారి రోడ్డులో సిండికేట్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లాలోనే అత్యాధునికమైన సౌకర్యాలతో ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకమరన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో వ్యాధి నిర్ధారణ పరికరాలు, ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతపురం జిల్లాకేంద్రంలో ఆధునిక శస్త్రచికిత్స పరికరాలతో సౌకర్యవంతంగా నిర్మించిన సాయినాథ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రతిష్టాత్మకంగా రూపొందించడం గర్వించదగ్గ విషయమన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, సురేంద్రబాబు, గుమ్మనూరు జయరామ్, పల్లె సింధూరారెడ్డి, దగ్గుపాటి వెంకటప్రసాద్, మాజీ మేయర్ స్వరూప, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, పలువురు టిడిపి నాయకులు, మేధావులు, వైసిపి నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

గుత్తి : పట్టణంలోని పలువురు దుకాణాదారులకు అధికారులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. స్థానిక గాంధీ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్లు, భవనాల శాఖకు చెందిన సర్వే నంబర్ 674లో ఉన్న 36 మందికి ఆక్రమణలు తొలగించాలని ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. 15 రోజుల్లోగా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. లేకపోతే ఎపి భూ ఆక్రమణ చట్టం 1905 మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంపచెట్లతో దర్శనమిస్తున్న సలకం చెరువు

కంపచెట్లతో నిండిన సలకం 'చెరువు'..!



ఏళ్లుగా రాని నీరు
బీళ్లుగా మారుతున్న భూములు
ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని సలకంచెరువు గ్రామంలో శ్రీరంగరాయల కాలంలో నిర్మించిన చెరువు కంపచెట్లతో నిరుపయోగంగా మారింది. ఈచెరువు నీటితో నిండితే సలకంచెరువుతో పాటు నాయనవారిపల్లి, ఇరువెందల, ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి, కొరివిపల్లి, చీలేపల్లి, తదితర గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు పుష్కలంగా లభిస్తుంది. చెరువు కింద అధికారకంగా సుమారు 292 ఎకరాల ఆయకట్టు ఉంది. శింగనమల చెరువుతోపాటు 5వ డిస్ట్రిబ్యూస్ బైపాస్ కెనాల్ ద్వారా కూడా సలకంచెరువు చెరువుకు నీరు వదలవచ్చు. అయితే ఈ దిశగా ఎవరూ ఆలోచించిన పాపానపోలేదని స్థానిక రైతులు, ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల ముందు మాత్రం పాలకులు సలకంచెరువు చెరువుకు నీరు తెస్తామని మాట ఇవ్వడమే తప్ప ఆచరణలో మాత్రం చూపడం లేదని అంటున్నారు. చెరువు ప్రారంభం నుంచి నీరు రాకపోవడంతో పెద్ద పెద్ద తుమ్మ, కంపచెట్లతో అడవిలా దర్శనమిస్తోంది. ఈ చెరువు నిండితే ఆయా గ్రామాల ప్రజలకు చేతినిండా పని దొరకడంతోపాటు పంటలు కూడా పడుతాయి. రైతులు, ప్రజలు సంతోషంగా ఉంటారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సలకంచెరువు చెరువును శుభ్రం చేయడంతోపాటు 5వ డిస్ట్రిబ్యూస్ బైపాస్ కెనాల్ నుంచి నీరు తీసుకురావాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రైతులు సహకరిస్తే నీరిస్తాం..



5వ డిస్ట్రిబ్యూటరీ బైపాస్ కెనాల్ ద్వారా తరిమెల, నిదనవాడ, ఆనందరావుపేట గ్రామం వరకూ నీరు వస్తోంది. నాయనవారిపల్లి, అనందరావుపేట గ్రామ ప్రజలు, రైతులు సహకరిస్తే హెచ్చెల్సీకి మరమ్మతులు చేపట్టి నీరిస్తాం. ముఖ్యంగా ఈసారి మరమ్మతులు దాదాపు పూర్తి చేయించాం. కావున రైతులు సహకరిస్తే 5వ డిస్ట్రిబ్యూటరీ బైపాస్ కెనాల్ ద్వారా సలకంచెరువు చెరువుకు నీళ్లిచ్చేందుకు కృషి చేస్తాం.

సురేంద్రరెడ్డి, హెచ్చెల్సీ ఇరిగేషన్ జెఇ

భూములు బీళ్లు అయ్యాయి..



సలకంచెరువు చెరువు కింద ఉన్న ఆయకట్టు దాదాపు 50ఏళ్ల పైబడే బీడు భూములుగా ఉన్నాయి. 5వ డిస్ట్రిబ్యూటరీ బైపాస్ కెనాల్ ద్వారా నీళ్లిస్తామని చెబుతున్నారుగానీ, ఇచ్చిన పాపానపోలేదు. చెరువుకు నీరు వస్తే మా గ్రామంతోపాటు ఈస్ట్ నరసాపురం, బుడ్డేపల్లి, చిన్నమట్లగొంది, చీలేపల్లి, నాయనవారిపల్లి గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. తద్వారా సాగు కూడా పెరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి మా చెరువుకు నీరివ్వాలి.

రైతు తిరుపాలు, సలకం చెరువు

భూగర్భజలాలు పెరుగుతాయి..



సలకం చెరువు చెరువుకు నీరొస్తే అక్కడున్న ఆయకట్టుతో పాటు గోవిందరాయునిపేట, శోదనపల్లి, పెద్దమట్లగొంది గ్రామాల్లో భూగర్భ పెరుగుతాయి. తద్వారా ఆరుతడి పంటలు వేసుకునే ఆవకాశం ఉంటుంది. దీంతోపాటుఈస్ట్ నరసాపురం వద్ద ఉన్న పెద్దకుంట చెరువుకు నీళ్లు వదిలితే మరింత సాగు పెరిగి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారు. దీనికితోడు కూలీలు, ప్రజలకు పనులు దొకి వలసలు కూడా ఉండవు.

రైతు హుస్సేన్‌పీరా, ఈస్ట్ నర్సాపురం

నేత్రదానం

నార్పల : మండల కేంద్రానికి చెందిన కరణం సరస్వతి కళ్లను కుమారులు దానం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సరస్వతి అనారోగ్యంతో మృతిచెందారు. ఈనేపథ్యంలో పుట్టెడు దు:ఖంలో ఉన్నా ఆమె కుమారులు కరణం రవికుమార్, కరణం రామానాయుడు ఎంతో గొప్ప మనసుతో ఆలోచించి తల్లి కళ్లను దానానికి ముందుకు వచ్చారు. దీంతో రెడ్‌క్రాస్ వారు వచ్చి సరస్వతి కళ్లను సేకరించారు. నేత్రదానానికి ముందుకొచ్చిన రవికుమార్, రామానాయుడును పలువురు అభినందించారు.

బాధితుడికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : రోడ్డు ప్రమాద బాధితుడికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ ఆదివారం ఆర్థికసాయం అందించారు. కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామానికి చెందిన రమేష్ మూడు రోజుల క్రితం బైక్ ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ బాధిత కుటుంబానికి రూ.35,000 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తిప్పేస్వామి, లక్ష్మన్న, చిరంజీవి, చాపిరి గ్రామస్థులు శ్రీరాములు, మూర్తి, నీలకంఠ, ఎర్రిస్వామి, కొల్లప్ప, హనుమంతు, నాగరాజు, రామాంజినేయులు, గంగన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కళ్యాణదుర్గం రూరల్ : పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీధర్ సూచించారు. జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం 2వరోజు మండల పరిధిలోని గోళ్ల ఎస్సీ కాలనీలో పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారాన్ని ఉంచుకోకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్లను వాడకూడదన్నారు. తర్వాత రోడ్లు, మురికి కాలువలను శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు.

ప్రజారవాణాకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ

నార్పల : ప్రజా రవాణాకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణ, గాంధీ కూడలి, గూగూడు రోడ్డులో స్వయానా డీఎస్పీ ట్రాఫిక్‌ను నియంతించారు. ఇందులో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉంచిన వాహనాలకు అపరాధ రుసుం విధించారు. అంతేగాకుండా తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు, తోపుడుబండ్ల వ్యాపారులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండాలని కోరారు.

సంతల ఆదాయం రూ.2,95,500

అనంతపురం : స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన పశువులు, గొర్రెలు మేకల సంత ద్వారా 2,95,500 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి రాఘవేంద్రకుమార్, సూపర్‌వైజర్ కిషోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో 'అనంత' క్రీడాకారులు

అనంతపురం : కర్నూలులోని శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్-2025లో అనంతపురం జిల్లా క్రీడాకారులు రాణించారు. అండర్-6 బాలుర విభాగంలో 4వ స్థానం సంతోష్, అండర్-12 బాలికల విభాగంలో 4వ స్థానం, వెనీషా అండర్-14 బాలుర విభాగంలో 5వ స్థానం, నితీష్ అండర్-10 బాలికల విభాగంలో 8వ స్థానం, జనని, అండర్-8 బాలుర విభాగంలో నిహాల్, శ్రీనిక్ రక్షన్ రాణించి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ చెస్ కోచ్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు విజేతలను అభినందించారు.

'సోలార్' ఏర్పాటుకు రైతులతో సమావేశం

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండలం కర్తనపర్తి, కొత్తపల్లి, గూళ్లెంవాళ్లు, చెన్నేపల్లి గ్రామాల్లో శ్రీశక్తి ఇంటిగ్రేటెడ్ సోలార్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్రాజెక్టుపై ఆదివారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీశక్తి ఇంటిగ్రేటెడ్ సోలార్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చెరకు అనిల్ దయాకర్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో అభివృద్ధి కోసం సుమారు 5600 ఎకరాల భూమిని రైతులు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ జయంత్‌జెట్టి రామచంద్ర, రీజనల్ డైరెక్టర్ సూర్యం, తెలంగాణ డైరెక్టర్ బాబన్న, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సిబ్బంది నిర్లక్ష్యంపై నిరసన

కళ్యాణదుర్గం టౌన్ : స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంపై బాధితులు ఆదివారం నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. రాయదుర్గం మండలం టి.వీరాపురానికి చెందిన గర్భిణీ తులసి గురువారం ఆసుపత్రిలో కాన్పు కోసం చేరింది. అయితే శనివారం సాయంత్రం నొప్పులు రావడంతో కాన్పు చేయడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో శిశువు మరణించింది. అంతేగాకుండా తులసి గర్భసంచి కూడా దెబ్బతినడంతో తొలగించారు. విషయం తెలుసుకున్న బాధితురాలి భర్త లక్ష్మీకాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. అయితే ఇందులో తమనిర్లక్ష్యం ఏమీ లేదని.. కాన్పు సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని సముదాయించే ప్రయత్నం చేసినా అంగీకరించలేదు. చివరికి ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ వచ్చాక మీతో మాట్లాడిస్తామని స్థానిక డాక్టర్లు చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

పామిడి : అనంతపురం ప్రఖ్యాత్ దంత వైద్యశాల సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 130 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. తర్వాత ఉచితంగా మందులు, టూత్ పేస్టులు, టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు. అనంతరం పామిడి లయన్స్ క్లబ్ తరపున 300 మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్ ప్రఖ్యాత్, డాక్టర్ మోబిసామెయిన్, క్లబ్ అధ్యక్షులు రఘువీర్, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, షేక్షావలి, ఆర్ఎంపి డాక్టర్ గంగాశేఖర్, తూర్పుంటి ప్రసాద్, నాగరాజు, కొండూరు అమర్నాథ్‌రెడ్డి, నరేష్, రాకేష్, అరుణబాయి, మహేష్, డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

శింగనమల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1987-1988లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూర్వపు ఉపాధ్యాయులు మనోహరీదేవి, నాందేవ్, సుబ్బారెడ్డి, పెద్దయ్య, బాలకష్ణ. హాజరయ్యారు. వీరికి పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తర్వాత ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత పూర్వపు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

బాలకృష్ణపై ఆరోపణలు చేస్తే సహించం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని మడకశిర ఎమ్మెలే, టిటిడి పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు తీవ్రంగా ఖండించారు. ఆదివారం నగరంలోని అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ మద్యం తాగి అసెంబ్లీలో మాట్లాడారంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే మాజీ సిఎంజగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటివ వ్యాఖ్యలు చేస్తే అభిమానులెవ్వరూ సహించే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. సమాజంలో గౌరవ మర్యాదలు కలిగిన వారిపై ఉద్దేశపూర్వకంగా బురదజల్లడం వైసీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మంచితనానికి బాలకృష్ణ మారుపేరు అన్నారు. తన పని తాను చేసుకుపోయే మనస్తత్వం ఉన్న వారు బాలకృష్ణ అన్నారు. జగరెడ్డిలా తండ్రి పదవిని, పార్టీని అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలు, దుర్మార్గాలకు పాల్పడే మనస్తత్వం బాలకృష్ణకు లేవని వివరించారు.

బస్సు ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి-గుంతకల్లు



జితేంద్రగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారికి ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ నివాళులర్పించారు. అనంతరం జితేంద్రగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, పూలదండలు, శాలువాలు వేసి సన్మానించారు. నియోజకవర్గంలోని పామిడి, గుత్తి, గుంతకల్లు మండలాల టిడిపి నేతలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, కౌన్సిలర్ రామగౌని పవన్‌కుమార్‌గౌడ్, యువనేత ఆర్.అనిల్‌కుమార్, కురుబ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కురుబ చంద్రశేఖర్, టిడిపి నాయకులు ముక్కన్నగారి రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన పెంచుదాం

ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలు, రైతులకు అవగాహన పెంచుదామని ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల వాలంటీర్లు స్థానిక ఆలమూరు గ్రామంలో సర్పంచు జి.సౌమ్య ఆధ్వర్యంలో 5వరోజు ఆదివారం ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పించారు. ఇందులో గాలివానలు, కరెంట్ షాక్, పిడుగులు, అగ్నిమాపక ప్రమాదాలు వంటి వాటిపై క్షణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు కృతిక, నవిత, గౌతమి, గీతాంజలి, షర్మిల, మల్లీశ్వరి, నవ్య, ప్రవీణ్, ప్రకాష్, నరేష్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నగర శివారుల్లో ఉన్న శిల్పారామంలో ఆదివారం నృత్య గురువు మానస, మానస నృత్య కళా కేంద్రం ధర్మవరం వారి బృందం క్లాసికల్, జానపదం నత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహా గణపతిం, ఉరుముల రమ్మంటిని, ఓ పిల్లగా వెంకటేష్, సుక్కటీరు, నీలి నీలి కళ్ళ వాడే, వైరల్ వయ్యారి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోక్ష, శాన్వి, చంద్రిక, హేమశ్రీ, యశస్వివిని, యుక్తశ్రీ, యోషిక, భానుశ్రీ, సుష్మిత, పల్లవి, అనూష, సన, నిహారిక తదితరులు పాల్గొన్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన రైతు శ్రీరాముల నాగిరెడ్డి పొలం వద్దకు ఎద్దుల బండిలో వెళ్తుండగా దారి మధ్యలో విద్యుత్ వైరు తెగిపడింది. గమనించని రైతు అటుగా ఎద్దుల బండితో రావడంతో కేబుల్ వైరును ఎద్దు తొక్కి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతచెందింది. వెంటనే గమనించిన రైతులు బండిమీద నుంచి పక్కకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. వ్యవసాయ పనులకు ఉపయోగపడే ఎద్దు మృతి చెందడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు ఆదుకోవాలని కోరారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తూర్పు కోడిపల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి స్ఫూర్తితో అందరూ ముందుకెళ్లాలన్నారు. వాల్మీకుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గత ఐదేళ్ల పాటు కుంటుపడిన అభివృద్ధిని ఇప్పుడు పట్టాలెక్కించామన్నారు. ఇందులో భాగంగానే కంబదూరు రోడ్డు 30 మీటర్ల వెడల్పుతో విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన తలారి వనజ బీటెక్, తలారి హర్ష నర్సింగ్ చదువుతుండగా వారి తండ్రి చనిపోవడంతో మధ్యలో ఆపేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారికి ఫీజు కట్టేందుకు ముందుకొచ్చారు. మరో విద్యార్థిని ప్రత్యూషకు తల్లి లేకపోవడంతో చదువుకునేందుకు జ్ఞానభారతి స్కూల్‌లో సీటుతో పాటు హాస్టల్ వసతి ఉచితంగా కల్పించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మీరమేష్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి రమేష్, గోళ్ల వెంకటేశులు, మోరేపల్లి మల్లికార్జున, డీకే రామాంజనేయులు, మల్లేపల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఎమ్మెల్యే భరోసా

కళ్యాణదుర్గం టౌన్ : కళ్యాణదుర్గం-అనంతపురం బైపాస్‌రోడ్డులో అనారోగ్యంతో రోడ్డుపై పడి ఉన్న బాధితుడికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. మదనపల్లికి చెందిన సురేష్ అనారోగ్యంతో బాధపడుతూ కిందపడిపోయినట్లు తెలుసున్న ఆయన బాధితునికి స్థానికంగా ఎవరూ సహాయకులు లేకపోవటంతో మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి పంపి మానవత్వాన్ని చాటుకున్నారు.

పాఠశాలలో సంగీత సత్సంగం

ప్రజాశక్తి - అనంతపురం

ప్రతి నెలా జరిగే సంగీత సత్సంగంలో భాగంగా ఆదివారం స్థానిక రెండవ రోడ్డులోని మహతి లలిత సంగీత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నటభూషణ శోభన్ బాబు నటించిన చిత్రాలలోని పాటలతో గాయనీ గాయకులు అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత కె.వి.మహీధర్, ఎంపి. శ్రీనివాసులు, నాగరాజు, టీచర్ శ్రీనివాసులు, శ్రీనివాస్, ఈశ్వరయ్య, ఆదినారాయణ రెడ్డి, రాధ, మాధవి, రమారెడ్డి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రతినిధులు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

నవంబర్ 4వ తేదీకి ర్యాలీ వాయిదా-వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని రుద్రంపేట, ఎ.నారాయణపురం, రాజీవ్‌కాలనీ, అనంతపురం రూరల్ పంచాయితీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కమిటీల నియామకం, ప్రయివేట్ మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీల్లో కొత్త కమిటీలను నవంబర్ 16వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పంచాయితీకు ఒక అధ్యక్షుడు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, నలుగురు కార్యదర్శులు, ఆరుగుగు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉంటారని చెప్పారు. అనుబంధ సంఘాలకు సంబంధించి యువజన, మహిళ, విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాలను కూడా పూర్తి చేయాలన్నారు. సోషల్ మీడియాకు సంబంధించి పంచాయితీకు ఇద్దరు ముగ్గురిని ఎంపిక చేయాలని సూచించారు. పార్టీపై చిత్తశుద్ధి ఉన్న వారిని మాత్రమే కమిటీల్లోకి తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఉంటాయని, పార్టీని బలోపేతం చేస్తూనే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్ఆర్‌సీపీ హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు.

పంచాయితీ స్థాయిలో 'కోటి సంతకాల సేకరణ'

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పంచాయతీ స్థాయిలో 'కోటి సంతకాల సేకరణ' చేపట్టాలని అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్న సమయంలో పేదలకు మెరుగైన వైద్యంతో పాటు వైద్య విద్యను అందుబాటులోకి తేవడం కోసం రూ.8 వేల కోట్లతో ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో 2019 వరకు కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మాత్రమే ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని చెప్పారు. పంచాయతీల్లో ప్రతిఇంటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. ఈనెల 28వతేదీన నియోజకవర్గ స్థాయిలో జరగాల్సిన ర్యాలీ తుఫాన్ దృష్ట్యా వచ్చేనెల 4వతేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

'దుర్గం'లో వ్యూహాత్మకంగా ఆక్రమణల తొలగింపు

ఫేక్‌పట్టా పేరుతో హోటల్ తొలగింపు- మాజీ టీడీపీ ప్రజాప్రతినిధి కాంప్లెక్స్‌లు తొలగింపునకు కసరత్తు



దివ్య హోటల్‌ను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఆక్రమణల తొలగింపు వ్యూహాత్మకంగానే జరుగుతోందన్న ప్రచారం జోరందుకుంది. రెండు రోజుల క్రితం ఆర్డీటీ ఆసుపత్రికి ఎదురుగా దళిత మహిళ దివ్య ఏర్పాటు చేసుకున్న హోటల్‌ను మున్సిపల్ అధికారులు, పోలీసులు బందోబస్తు మధ్య తొలగించారు. దివ్య హోటల్‌తో తొలగింపు ప్రక్రియ మొదలు పెట్టి కంబదూరు రోడ్డులోని బడాబాబుల ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టాలని భావించినట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఇక్కడి నుంచి మొదలుపెడితే ఎవరిపై వివక్షతలేదని సంకేతాలివ్వడానికి తొలగించే ప్రక్రియను ఆరంభించినట్లు స్పష్టమవుతోంది. దివ్య హోటల్ ఘటనతో ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు ఆందోళనకు దిగాయి.

మాజీ ప్రజాప్రతినిధి కాంప్లెక్స్ తొలగింపునకు వ్యూహం..?

పట్టణంలోని కంబదూరురోడ్డు, రింగ్‌రోడ్డులో నిర్మించుకున్న టిడిపి మాజీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల కాంప్లెక్స్‌లను తొలగించేందుకు వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. సదరు ప్రజాప్రతినిధి గతంలో నియోజకవర్గంలో ముఖ్య నాయకుడిగా గుర్తింపు పొందారు. అలాంటి ఆయన కుటుంబం 2024 ఎన్నికల్లో సహకరించలేదనే ఆరోపణలతోపాటు అధిష్టానానికి ఫిర్యాదులు కూడా చేరాయి. అంతేగాకుండా ఇటీవల కళ్యాణదుర్గంలో ఈ-స్టాంపుల కుంభకోణం వ్యవహారం కూడా ప్రస్తుత ఎమ్మెల్యేకు తలనొప్పి తెచ్చిపెట్టిందని చెప్పవచ్చు. ఈ కుంభకోణంలో మాజీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులు పాత్ర ఉందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అప్పటి నుంచి రెండు వర్గాల మధ్య వివాదం మరింత ముదిరిందని చెప్పవచ్చు. దీంతో సదరు టిడిపి మాజీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులు ఆర్అండ్‌బి స్థలంలో నిర్మించిన కాంప్లెక్స్ తొలగించకుండా ఎందుకు ఉపేక్షించాలనే ఆలోచన ఎమ్మెల్యే అనుచరుల్లో వ్యక్తమవుతుంది. ఇందులో భాగంగానే మాజీ ప్రజాప్రతినిధి కాంప్లెక్స్‌ను ఏక్షణమైనా కూల్చడానికి అధికార యంత్రాంగం సిద్ధమైనట్లు సమాచారం.

చెప్పకనే చెప్పిన ఎమ్మెల్యే

మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఆర్అండ్‌బి రోడ్ల ఆక్రమణలను తొలగిస్తామని.. ఇందులో ఎవరిపైనా కక్షసాధింపు లేదని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మీడియాతో వెల్లడించడంతో మాజీ ప్రజాప్రతినిధి కాంప్లెక్స్ తొలగింపు తప్పదనే విషయాన్ని చెప్పకనే చెప్పినట్లయింది. కంబదూరు రోడ్డులో 30 మీటర్ల వెడల్పు చేయాలని అధికారికంగా లెక్కలు కూడా అంత విస్తీర్ణంలో ఉన్నాయని చెబుతున్నాయి. ఎవరికి సంబంధించి సొంత స్థలాలను ఏమాత్రం నష్టం చేయమని చెప్పుకొచ్చారు. కేవలం అభివృద్ధి కోసమేనంటూ ఎమ్మెల్యే చెప్పడం వెనుక ఆంతర్యం ఏదో దాగి ఉంటుందని పట్టణవాసులు చర్చించుకోవడం కనిపిస్తోంది.